క్లుప్తంగా

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న పెంటుబాయి

ఆసిఫాబాద్: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెంటుబాయి తెలిపారు. ఈ నెల 1నుంచి 7వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని బొక్కలగుట్ట, ఆసిఫాబాద్-3 అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టగానే ముర్రుపాలు పట్టించాలని సూచించారు. ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని తెలిపారు. తల్లిపాలు పట్టించడం ద్వారా బిడ్డకు వ్యాధులు దరి చేరవని పేర్కొన్నారు. తల్లికీ రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, శోభ, మంజుల, రజని పాల్గొన్నారు.

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

రెబ్బెన: మండలంలో గంగాపూర్ రైతువేదికలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సూర్యప్రకాశ్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి నూతనంగా 713 కార్డులు, కుటుంబ సభ్యులు పేర్ల చేర్పులతో 1,235 కార్డులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు కార్యక్రమానికి హాజరు కానున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్ అన్నారు. శుక్రవారం ఉట్నూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థినులకు టై, బెల్టు అందచేశారు. ప్రతీ ఉపాధ్యాయుడు సామాజిక బాధ్యతగా వారి వారి పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మూగ శ్రీనివాస్, జాదవ్ అశోక్ కుమార్, బెజ్జంకి రవీంద్ర పాల్గొన్నారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

తాంసి: ఎస్టీయూ భవన్‌లో ఈనెల 5న నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎస్‌వో వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జిల్లా పంచాయతీ అధికారి రమేశ్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అనంతరం జాబ్‌మేళా పోస్టర్, క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఎంపీడీవో మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

బోథ్: బోథ్, సొనాల మండలాల రాజ్‌గోండ్ సేవా సమితి మండల కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా అధ్యక్షుడు పంద్రం శంకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కనక అమత్ రావు, గౌరవ అధ్యక్షుడిగా తొడసం గోపాల్, ఉపాధ్యక్షుడిగా మండాడి మోహన్, గోడం రమేశ్, ప్రధాన కార్యదర్శిగా తొడసం నిలకాంత్ రావు, కార్యదర్శులుగా సెడ్మాకి సురేశ్, సంగెపు శంకర్, కోశాధికారిగా కొడప రమేశ్, ప్రచార కార్యదర్శిగా ఆత్రం దేవరావు, సాంస్కృతిక కార్యదర్శిగా మాడవి లక్ష్మణ్, సలహాదారులుగా మండడి రాము, ఉయిక భీం రావ్‌లను ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ఇచ్చోడ: జూవెలిన్ త్రో రాష్ట్రస్థాయి పోటీలకు మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే విద్యార్థి అజయ్ ఎంపికయ్యారు. జూలై 28న అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్- 20 పోటీల్లో పాల్గొని అజయ్ ప్రథమ స్థానం సాధించడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణ సిబ్బంది, విద్యార్థిని అభినందించారు.

తాంసి ఐకేపీ ఏపీఎంగా భగువాండ్లు

తాంసి: మండల ఐకేపీ ఏపీఎంగా భగువాండ్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా రవీందర్‌ను భీంపూర్ మండలానికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఏపీఎంకు సీసీలు మహేందర్, రాజు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

సన్మానం

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఐకేపీ కార్యాలయంలో ఏపీఎంగా విధులు నిర్వహించి బదిలీపై ఉట్నూర్ ఏపీఎంగా వెళ్లిన ఏపీఎం రామరావ్‌ను శుక్రవారం ఇంద్రాయి మహిళా సమాఖ్య సంఘం సభ్యులు శాలువాతో సత్కరించారు. సీఏలు బొమ్మెన శ్రీరాం, దేవ్‌సింగ్, యేర్మ మోతిరాం, శోభాబాయి పాల్గొన్నారు.

దోమల నివారణకు సన్నద్ధం

- నీటినిల్వలను పారబోస్తున్న సిబ్బంది
- గ్రామాల్లో కొనసాగుతున్న డ్రైడే, ఫ్రైడే



గోయిగాంలో తొట్టిలో ఉన్న నీటిని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



ఇంద్రానగర్‌లో డ్రెయినేజీలో దోమల మందు పిచికారీ చేస్తున్న వైద్యసిబ్బంది

కెరమెరి: గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలకుండా పంచాయతీ, వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. దోమల నివారణపై దృష్టిపెడుతుంది. గ్రామీణ ప్రజలకు జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలతోపాటు వ్యాధుల బారినపడి ఆస్పత్రుల వైపు పరిగెత్తకుండా శాఖల అధికారులు సమన్వయంతో గ్రామాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. గడిచిన వారం రోజులుగా వర్షాలు ఇబ్బడిముబ్బడిగా పడి వ్యాధులు ఉత్పన్నమయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయి. గ్రామాల్లో ఇటు వైద్యారోగ్య శాఖ, అటు పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది కార్యచరణ చేపట్టారు. మండలంలోని 31 పంచాయతీలు ఉండగా, 8 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. 156 ఆవాసాల్లో 9 వేల కుటుంబాలు ఉండగా, 34 వేల జనాభా ఉంది.

డ్రైడే..ఫ్రైడే

వారంలో ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆశవర్కర్లు, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నీటి తొట్టి, టైర్లు, డబ్బాలు, డ్రమ్ముల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడ నీరు నిలిచి కనిపిస్తే అక్కడ పారేస్తున్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా మట్టి పోసి పూడ్చివేస్తున్నారు. పాత కూలర్ల, తాగిపడేసిన కొబ్బరి బొండాలు, గాజు, మట్టి పాత్రలను గుర్తించి నీటిని తొలగించాలని సూచిస్తున్నారు. క్రిమీకాటకాలు అరికట్టేందుకు డ్రెయినేజీ, ప్లాస్టిక్ కవర్ బాటిళ్ల ఇతర వ్యర్థాలు పడేయవద్దని వివరిస్తున్నారు. దోమలు సాయంకాలం వేళ అధికంగా ఉంటాయని ఇళ్లల్లోని కిటికీలకు దోమతెరలు బిగించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కాగా గ్రామాల్లో డ్రెయినేజీలు, ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో మందు పిచికారి చేస్తున్నారు.

చర్యలు చేపడుతున్నాం



ప్రజలు రోగాల బారిన పడకుండా గ్రామాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఆశకార్యకర్తలు వైద్యసిబ్బంది, కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. దగ్గు, జ్వరం, ఇతర వ్యాధులు వస్తే పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయాలని సూచిస్తున్నాం.

– కె.వినిద్‌కుమార్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ

దహెగాం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక రైతువేదికలో రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో మరోసారి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇచ్చిన ఘతన కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన ఒక్కరేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదన్నారు. దీంతో పేద ప్రజలు అనేక సంక్షేమ పథకాలకు దూరమయ్యారన్నారు. విద్యా, వైద్యం కోసం రేషన్‌కార్డు ఉపయోగపడుతుందన్నారు. పేద ప్రజలకు సన్న బియ్యం అందిస్తుందన్నారు. డీలర్లు, వ్యాపారులు సన్న బియ్యాన్ని విక్రయించినా.. కొనుగోలు చేసినా.. కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండలంలో 207 నూతన రేషన్ కార్డులు, అదనంగా మరో 840 మందిని పేర్లు చేర్చడం జరిగిందని అదనపు కలెక్టర్ డెవిడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, సహకార సంఘం చైర్మన్ కోండ్ర తిరుపతి గౌడ్, ఏడీఏ మనోహర్, తహసీల్దార్ మునవార్ షరీఫ్, ఇన్‌చార్జి ఎంపీడీవో అల్బర్ట్ పాల్గొన్నారు.

ఘనంగా అన్నాభావు సాఠే జయంతి



అన్నాభావు సాఠే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో దళిత నేత అన్నాభావు సాఠే జయంతిని శుక్రవారం భారతీయ బౌద్ధ మహాసభ, అంబేడ్కర్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశ ప్రజలను బానిసత్వం, అంటరానితనం పట్టి పీడిస్తున్న సందర్భంలో అనేక పోరాటాలు సాగించారని గుర్తు చేశారు. ఎక్కువగా చదువుకోకపోయినా అనేక నవలలు, కథ సంకలనాలు, నాటికలు, జానపదాలు రచించారని తెలిపారు. ఆయన రచనల్లో కార్మిక వర్గాల జీవన విధానాలు కళ్లకుకట్టినట్లుగా వివరించారని పేర్కొన్నారు. కార్మిక వర్గాలను చైతన్య పర్చడంలో ఆయన కృషి గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, మండలాధ్యక్షుడు దుర్గం దుర్గాజీ, ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు దుర్గం సునీల్, శ్యాంరావు, ప్రతాప్, రోషన్, దుర్గం ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



నల్లాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో అంజద్‌పాషా సూచించారు. శుక్రవారం మండలంలోని మోడి గ్రామపంచాయతీని ఆయన సందర్శించారు. వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. గ్రామంలో చెత్తాచెదారం లేకుండా చూడాలని, మురుగుకాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలని తెలిపారు. అనంతరం మండలంలోని మెట్టపిప్రి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. కుళాయిలు, వంటగదులను పరిశీలించారు. విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్‌ఎం ప్రశాంత్‌కు సూచించారు.

ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు

- ఏళ్ల తరబడి పట్టించుకోని యజమానులు
- వృద్ధి చెందుతున్న దోమలు, ఈగలు
- పట్టించుకోని అధికారులు



పెట్రోల్ పంప్ ఏరియాలో పెరిగిన పిచ్చిమొక్కలు

కాగజ్‌నగర్ టౌన్: పట్టణంలోని ఖాళీ స్థలాలు అపరిశుభ్ర వాతావరణానికి నిలయంగా మారాయి. ఈ ప్లాట్లను శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత యజమానులదే. కానీ వారు ఏళ్ల తరబడిగా పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు, మురుగు నీటితో నిండిపోయాయి. వర్షాకాలం కావడంతో ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరిగి, నీరు నిల్వ చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఖాళీ స్థలాలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ప్రతీ వార్డుల్లో ఇదే తంతు..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులున్నాయి. ప్రతీ వార్డులో పదుల సంఖ్యకు పైగా ఖాళీ స్థలాలున్నాయి. శివారు కాలనీలో అంతకు మించి ఖాళీ స్థలాలు ఉన్నాయి. సమీపంలోని ఇళ్ల వాసులు చెత్త చెదారాన్ని ఖాళీ ప్రదేశాల్లోనే పడేస్తుండడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. గాంధీనగర్, శ్రీరాంనగర్, సీతాపతి రోడ్, ద్వారకానగర్, పెట్రోల్‌పంప్ ఏరియా, టీచర్స్ కాలనీ, ఆదర్శనగర్, సర్ సిల్క్ కాలనీ, గుంటూరు కాలనీ, శ్రీకృష్ణనగర్, మారుతినగర్ కాలనీల్లోని ఖాళీ స్థలాలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఖాళీ ప్లాట్ల యాజమనులకు నోటీసులు ఇచ్చి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

బదిలీపై వెళ్తున్న ఏపీఎంకు సన్మానం



ఏపీఎం మహేశ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఏపీఎం మహేశ్‌ను ఐకేపీ కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. పదేళ్ల పాటు మండలంలో విధులు నిర్వర్తించి మహిళా సంఘాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు ఇప్పించి మహిళలు స్వయం ఉపాధి పొందేలా కృషి చేశారని తెలిపారు. విధి నిర్వహణలో చూపిన శ్రద్ధ, కృషితోనే మండలానికి జిల్లాలో ప్రత్యేక స్థానం లభించిందని పేర్కొన్నారు. అనంతరం మండలానికి నూతనంగా వచ్చిన ఏపీఎం కోనయ్యను శాలువాతో సన్మానించి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో శ్రావణ్‌కుమార్, సీసీలు, పదాధికారులు, వీవోఏలు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీలపై నిబంధనలు రుద్దడం సరికాదు



సభ్యత్వ నమోదు చేస్తున్న ఆడే ప్రకాశ్

కెరమెరి(ఆసిఫాబాద్): రాష్ట్రంలో ఎక్కడా లేని నిబంధనలు జిల్లాలోని కేజీబీవీలపై రుద్దడం సరికాదని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆడే ప్రకాశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మోడి, అనార్‌పల్లి, రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాల, కేజీబీవీల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే జిల్లాలో కేజీబీవీలు చక్కగా పనిచేస్తున్నప్పటికీ వారిపై మళ్లీ అదనపు భారం మోపడం సరికాదన్నారు. రాష్ట్రంలో జీపీఎఫ్ టీఎస్‌జీఎల్ఐ రుణాలు మంజూరై రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఉపాధ్యాయులకు నేటికీ అందడం లేదని తెలిపారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పీఆర్టీయూటీఎస్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల బాధ్యులు జాదవ్ రవీందర్, శివప్రసాద్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ సద్దాం

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సద్దాం అన్నారు. శుక్రవారం మండలంలోని గుత్పలా గ్రామంలో గల మినీ గురుకులంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఏఎన్‌ఎం కల్పన, హాస్టల్ ఏఎన్‌ఎం వాణిశ్రీ,, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, గంగామణి పాల్గొన్నారు.

● గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు హెచ్ఈవో పవర్ రవీందర్ తెలిపారు. శుక్రవారం నేరడిగొండ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సాయన్న, శ్రీనివాస్ రెడ్డి, ఆశ కార్యకర్త కమల, చంద్రకళ పాల్గొన్నారు.

భీంపూర్: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి మిట్టపల్లి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పర్యటించి ఇంటి చుట్టూ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. గ్రామంలో డెంగ్యూ నిర్ధారణ కావడంతో పరిసరాల పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ఎంపీవో సుమేశ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

వాంకిడి: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని డీటీడీవో రమాదేవి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గది, వంటగది, సరుకులు, పరిసరాలు, స్టాక్ రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే భోజనంలో తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులను వినియోగించాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా నిత్యం పారిశుధ్య పనులను నిర్వహించాలని, వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. హాస్టల్‌లో ఏవైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

సాలేగూడలో తాగునీటికి తండ్లాట

- సరఫరా కాని మిషన్ భగీరథ నీరు



బోరుబావి వద్ద నీటిని పడుతున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని తెజాపూర్ పరిధిలోని సాలేగూడ గ్రామస్తులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో, మంచి నీటి పథకాలు పని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులు పక్కన పెట్టి గ్రామానికి దూరంగా ఉన్న బోరు బావి నుంచి ఎడ్లబండ్లు, వాహనాల ద్వారా నీటిని తీసుకువస్తున్నామని వాపోతున్నారు. నీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సూర్య ప్రకాశ్

రెబ్బెన: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని తహసీల్దార్ సూర్య ప్రకాశ్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను హౌసింగ్ ఏఈ నాగరాజుతో కలిసి పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ లబ్ధిదారులు హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు ధ్రువీకరించిన లెటర్‌తో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే టోకెన్ జారీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బిడ్డకు ముర్రుపాలు తాగించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాధన

సాత్నాల: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని డాక్టర్ సాధన అన్నారు. శుక్రవారం కన్నా మెడిగూడ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిశువులకు తల్లిపాలు అమృతం లాంటివని, వ్యాధుల నుంచి రక్షించే యాంటీబాడీ లు కలిగి ఉంటాయన్నారు. ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మ, సూపర్‌వైజర్ అనిత, ఏఎన్‌ఎం జ్యోతి, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కనక లక్కేరావ్ వర్ధంతి

ఇంద్రవెల్లి: ఆదిమ గిరిజన సలహా మండలి చైర్మన్ దివంగత కనక లక్కేరావ్ ద్వితియ వర్ధంతిని శుక్రవారం మండలంలోని తుమ్మగూడలో ఘనంగా నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరై కనక లక్కేరావ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మనవరాలు, మనువళ్ల చదువుల కోసం రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించారు. అదే విధంగా రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయితో పాటు పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె,ఆదివాసీ సంఘాల నాయకులు, రాయిసెంటర్ పటేల్‌లు శ్రద్ధాంజలి ఘటించారు.

ఉపాధ్యాయులను నియమించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని బావోజీపేట్ ప్రాథమిక పాఠశాలకు అదనంగా మరో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని బావోజీపేట్ గ్రామస్తులకు శుక్రవారం ఎంఈవో బిక్కుకు వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక పాఠశాలలో దాదాపుగా 40 మంది విద్యార్థులకు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకే ఉపాధ్యాయుడు ఉండటంతో విద్యార్థులకు సరైన విద్య అందడం లేదన్నారు. కార్యక్రమంలో గుండాల రమేశ్, అన్నెల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.